ప్రసన్నకు అండగా ఉంటాం

● ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం ● కలెక్టర్ రాజకుమారి



బాలిక, నాయనమ్మను ఓదార్చుతున్న కలెక్టర్ రాజకుమారి

చాగలమర్రి, ఆగస్టు 9: మండలంలోని చిన్న వంగలిలో మట్టిమిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెంది అనాథగా మిగిలిన బాలిక ప్రసన్నకు అండగా ఉంటామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం చిన్నవంగలి గ్రామంలో కూలిన మట్టి మిద్దెను ఆమె పరిశీలించారు. అనంతరం ప్రసన్నను ఓదార్చి అండగా ఉంటామంటూ మనోధైర్యం ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మట్టిమిద్దె కూలి నలుగురు మృతి చెందడం బాధాకరం అన్నారు. బాలిక ప్రసన్నకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన రూ.10 లక్షలు చెక్కు, ప్రసన్న బాగోగులు చేసుకునే నాయనమ్మకు రూ.2 లక్షలు చెక్కును ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా ఇటీవల అందజేశారు. బాలిక ప్రసన్న బాధ్యతను అన్ని విధాలా చూసుకుంటామని అన్నారు. ప్రొద్దుటూరు ఉషోదయ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ప్రసన్నకు ఉచిత విద్యను అందిస్తామని అన్నారు. ఉన్నత చదువులు చదివేంత వరకు తాము అండగా ఉంటామని అన్నారు. కూలిన మట్టిమిద్దెకు ప్రత్యేక గృహం కూడా మంజూరు చేస్తామని అన్నారు. కలెక్టర్ ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, హౌసింగ్ ఈఈ హరిగోపాల్, డీఈ నాగరాజు, ఏఈ షఫివుల్లా, ఎంఈవో అనురాధ, ఏపీవో నిర్మల, ఏవో రాజేంద్రప్రసాద్, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, కార్యదర్శి నాగార్జున, వీఆర్వో సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

అసలైన అరాచక వాది జగన్

కోర్టుకు గైర్హాజరయ్యేందుకే ప్రతి శుక్రవారం ఓ కార్యక్రమం ● వైఎస్ జగన్‌పై మండిపడిన మంత్రులు, ఎంపీ ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

నంద్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శవ రాజకీయం చేయడానికే మాజీ సీఎం జగన్ నంద్యాలకు వచ్చాడని, ఆయన అసలైన అరాచకవాది అని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మంత్రులు ఫరూక్, బీసీతో పాటు ఎంపీ బైరెడ్డి శబరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, భూమా అఖిల ప్రియ, గిత్తా జయసూర్య తదితరులు విలేకరులతో మాట్లాడారు. మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ భారతదేశంలో జగన్‌మోహన్‌రెడ్డి మించిన క్రిమినల్ లేరని నేషనల్ మీడియా కోడై కూస్తోందన్నారు. అభివృద్ధి గురించి మాట్లాడకుండా హత్యను రాజకీయం చేయడానికి వచ్చాడన్నారు. ప్రత్యేకించి శుక్రవారం ఎందుకు ఇలాంటి కార్యక్రమాలు పెట్టుకుంటున్నాడని ప్రశ్నించారు. తాను కూడా వినుకొండ వెళ్లానని అక్కడ జరిగింది వేరన్నారు. కానీ దానిని తాము రాజకీయం చేయదలుచుకోలేదని, ఓడిపోయిన తర్వాత అభివృద్ధి గురించి మాట్లాడాలి కానీ ఇదేం తీరని ప్రశ్నించారు. నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య వెనుక వైసీపీ వారి హస్తం ఉందన్నారు. వారు ఆయన పక్కనే ఉన్నారని, వారిని పట్టుకుని శిక్షించాలి గానీ ఇలాంటి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. రోడ్లు భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ఆ రోజు వైనాట్ 175 అంటే ప్రజలు కేవలం 11 సీట్లు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 36 హత్యలు జరిగాయని చెబుతున్న జగన్ ఆ హత్యలు ఎక్కడ జరిగాయో చెప్పలేక పారిపోయాడన్నారు. ఇక జగన్ చరిత్ర మొత్తం పూర్తిగా హత్యా రాజకీయాలపైన సాగుతోందన్నారు.

ఎంపీ శబరి మాట్లాడుతూ జగన్ నంద్యాలకు వచ్చిన తర్వాత ఏదైనా మంచి మాట్లాతాడనుకుంటే చెప్పిన స్క్రిప్టునే మళ్లీ మళ్లీ చదువుతున్నారన్నారు. ఐదేళ్లలో ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, మంత్రులకు ముఖం చూపించని జగన్ ఇవాళ నంద్యాల వచ్చి రాజకీయం చేయడం సరికాదన్నారు. మహానంది మండలం సీతారామాపురం గ్రామంలో జరిగింది పూర్తిగా దారుణమని, తాము కూడా ఖండిస్తున్నామన్నారు. అసలు సీతారామాపురంలో జరిగింది పూర్తిగా రెండు కుటుంబాల మధ్య గొడవలేనని అన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ జగన్ పాలనలో వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలతో పాటు పంచాయతీల పేరుతో సామాన్య ప్రజలను హత్య చేసినపుడు ఎందుకు బాధితుల కుటుంబాన్ని పరామర్శించలేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ రాష్ట్రంలో 11 సీట్లకే వైసీపీని ప్రజలు పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదని, ఇకనైనా శవరాజకీయాలను మానుకోవాలన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ జగన్ చుట్టూ ఉన్న నాయకులు క్రిమినల్ మైండ్ ఉన్న వారేనని అందుకే అలా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రతి దానికి రాజకీయ రంగు పులిమి ఏదో చేయా లకోవడం వైసీపీ నాయకులకే చెల్లుతుందన్నారు. అసలు ఆ గ్రామంలో చిచ్చు పెట్టిందే శిల్పా చక్రపాణిరెడ్డి అని అన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ రాజకీయాలు హుందాగా వ్యవహరించాలే కాని అరాచకాలకు పాల్పడకూడదన్నారు. అందుకే ప్రజలు ఓటుతో జగన్ పార్టీకి బుద్ధి చెప్పారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ శవాల వద్దకు రాబందులు వచ్చినట్లు జగన్ నంద్యాలకు శవ రాజకీయం చేయడానికి వచ్చాడని, వాస్తవం ఏమిటో ఆయనకు తెలియకపోతే, ఇక్కడి వైసీపీ నాయకులకు తెలియదా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

రూ.1,800 కోట్లతో ఓర్వకల్లు పారిశ్రామికాభివృద్ధి

- ఫార్మా హబ్ ఏర్పాటుకు చర్యలు
- రైల్వేలైన్, నీటి నిల్వ రిజర్వాయర్ నిర్మాణం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి ఓర్వకల్లు పారిశ్రామికవాడ పరిశీలన



ఓర్వకల్లు పారిశ్రామిక వాడలో మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు/కర్నూలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీసిటీని మించి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి చేస్తామని, అందుకోసం రూ.1,800 కోట్లను కేటాయిస్తున్నట్లు పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి శుక్రవారం ఇండస్ట్రియల్ నోడ్ ప్రాంతంలో పర్యటించారు. గత వైసీపీ పాలనలో ధ్వంసం చేసిన రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు వేసిన శిలాఫలకాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి గుట్టపాడు గ్రామ సమీపంలో ఏపీఐఐసీ భూములు పరిశీలించారు. అక్కడే గత టీడీపీ ప్రభుత్వంతో చంద్రబాబు శంకుస్థాన చేసిన జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమను మంత్రి భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత పరిశీలించారు. ఆ పరిశ్రమ ఎండీ కొయాంక వారికి స్వాగతం పలికారు. స్టీల్ పరిశ్రమ నిర్మాణం, లక్ష్యాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కంపెనీ ప్రతినిధులు వివరించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం మారుతి ప్రసాద్‌లు పది వేల ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ ఎలా అభివృద్ధి చేస్తున్నామో మంత్రి, ఎమ్మెల్యేలకు వివరించారు. మాస్టర్ ప్లాన్ పరిశీలించిన మంత్రి భరత్ పలు సూచనలు చేశారు. తిరుపతి శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. అక్కడ ఆ స్థాయిలో మౌలిక వసతులు ఉన్నాయి. శ్రీసిటీకి దీటుగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌లో మౌలిక వసతులు కల్పించడానికి అనుభవం కలిగిన సంస్థతో డీపీఆర్ తయారు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమలు ఇక్కడికి రావాలంటే రోడ్లు, నీరు, రైల్వే రవాణా, విమానయానం వంటివి ఎంతో ముఖ్యమన్నారు. పది వేల ఎకరాల్లో అధునాత సౌకర్యాలతో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ముచ్చుమర్రి లిఫ్ట్ నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోసి నిల్వ చేసే జలాశయం, దూపాడు నుంచి రైల్వేలైన్, ఓర్వకల్లు నుంచి విజయవాడకు విమాన సౌకర్యం కల్పిస్తామని అన్నారు. ఇది రెడ్ జోన్ కావడంతో ఫార్మా సహా అన్ని రకాల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం పెట్టుబడుల కోసం కృషి చేస్తే.. గత వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు వేసిన ఇండస్ట్రియల్ మెగా హబ్ శిలాఫలకం ధ్వంసం చేశారని, వారికి ఉన్న పైశాచిక ఆనందం ఏపాటిదో తెలుస్తోందన్నారు. మళ్లీ చంద్రబాబు కాగానే పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ముందుకు వస్తున్నారన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ గతంలోనే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ మెగా హబ్ కోసం చంద్రబాబు ఎంతో కృషి చేశారన్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక హబ్‌ను విధ్వంసం చేశారన్నారు. దేవదాయ, వక్ఫ్ భూములను కబ్జా చేయడంపైనే వైసీపీ నేతలు దృష్టి పెట్టారే తప్పా యువత కోసం ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేదన్నారు. మంత్రి టీజీ భరత్ సహకారంతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధితో పాటు పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గుట్టపాడు సర్పంచ్ మోహన్‌రెడ్డి, కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు సోమశేఖర్‌రెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం మారుతి ప్రసాద్, ఏఈ సందీప్, ఓర్వకల్లు తహసీల్దారు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలను పరిష్కరిస్తాం

ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్) ఆగస్టు 9: ప్రకృతికి దగ్గరగా జీవిస్తున్న గిరిజనుల సమ స్యలన్నీ పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నా మని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. చెం చుసుగాలి, ఎరుకల, యానాది తదితర జాతుల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు కలిసి కట్టుగా కృషి చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. శుక్ర వారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో 49 గిరిజన ప్రాంతాల్లో ఉన్న తల్లి దండ్రులందరూ తమ పిల్లల్ని పాఠశాలలకు పంపిం చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, బం జారా సేవా సంఘం రాష్ట్ర నాయకులు వెంకటరమణ నాయక్, రాజునాయక్, ఎస్టీసెల్ అధికార ప్రతినిధి స్వామినాయక్‌లు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువకు మల్లెంపల్లి సమీపంలో పడిన గండి (ఫైల్)



మెఘా నిర్లక్ష్యం..!

కర్నూలు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రధాన కాలువ నిర్వహణ బాధ్యత మెఘా ఇంజనీరింగ్ కంపెనీదే. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం, నిర్వహణపై ఆ సంస్థ అంతులేని అలసత్వం ఆయకట్టు రైతులకు శాపంగా మారింది. కాలువ గట్లు బలహీనంగా మారాయి. కాలువ విస్తరణ పనులకు రూ.6,182 కోట్లతో గత వైసీపీ పభుత్వం టెండర్లు పిలిస్తే ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ బిల్లులు రావనే భయంతో రీ సర్వే పేరిట రెండున్నరేళ్లు గడిపేశాయి. కాలువ గట్లు బలహీనంగా మారుతున్నాయి. మరమ్మతులకు నిధులు ఇవ్వబోమని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపితే విస్తరణ బూచి చూపి గత వైసీపీ ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. ఫలితంగా మల్లెంపల్లి వద్ద గండి పడింది. రెండు మూడు రోజుల్లో గండి పూడ్చినా 1,500 క్యూసెక్కులు తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కాలువ గట్టుపై ముళ్ల పొదలు కూడా తొలగించలేని (జంగిల్ క్లియరెన్స్) దైన్య పరిస్థితి. కాలువ విస్తరణ దేవుడెరుగు.. మరమ్మతులు, అసంపూర్తి పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

రాయలసీమ జిల్లాల జీవనాడి హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందించే ప్రధాన కాలువ పలు చోట్ల ప్రమాదకరంగా మారింది. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కి.మీ. ప్రధాన కాలువ, ఎనిమిది లిఫ్టులు నిర్మించారు. కాలువ ప్రవాహ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు కాగా.. 1,500 క్యూసెక్కులు కూడా తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. గత సోమవారం వెల్దుర్తి మండలం మల్లెంపల్లి సమీపంలో కాలువకు భారీగా గండి పడడం.. నిర్వహణ సంస్థ మెఘా కంపెనీ నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా హంద్రీ నీవా కాలువ ద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఏ నెలలో ఏ రిజర్వాయరు నింపాలని ఇటీవల జరిగిన ప్రాజెక్టుల సమీక్షలో సీఎం చంద్రబాబు ఇంజనీర్లకు లక్ష్యాలను నిర్దేశించారు. మల్లెంపల్లి గండిని తాత్కాలికంగా మరమ్మతులు చేసి ఇసుక బస్తాలు వేసినా.. పూర్తి స్థాయిలో సామర్థ్యంలో నీటిని పంపింగ్ చేయలేని పరిస్థితి ఉందని ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.

హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ఫేజ్-1 కింద 216.30 కి.మీ. ప్రధాన కాలువ, ఎనిమిది ఎత్తిపోతల పథకాలు (లిఫ్టులు) నిర్మాణ పనులు మెఘా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టింది. రాష్ట్ర విభజన తరువాత 2014-15 నుంచి శ్రీశైలం జలాశయంలో నీటి లభ్యతకు అనుగుణంగా పూర్తిస్థాయిలో వరద జలాలు ఎత్తిపోస్తున్నారు. ఏటా కనిష్టంగా 16.81 టీఎంసీలు, గరిష్టంగా 47.38 టీఎంసీలు ఎత్తిపోశారు. ఒప్పందం ప్రకారం కాలువ, పంపింగ్ స్టేషన్ల నిర్వహణ బాధ్యతలు కాంట్రాక్ట్ సంస్థదే. పంపింగ్ స్టేషన్ల నిర్వహణ తప్పా ప్రధాన కాలువ నిర్వహణపై ఆ సంస్థ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. నందికొట్కూరు, కృష్ణగిరి, పత్తికొండ, మద్దికెర ప్రాంతాల్లో ప్రధాన కాలువ గట్టుపై నిండిపోయిన ముళ్ల పొదలు పెద్దపెద్ద చెట్లుగా మారాయి. వాటి వేర్లు కాల్వ గట్టు మట్టి లోపలికి వెళ్లడంతో మట్టి లూజుగా మారడం.

బలహీనంగా మారిన కాలువ గట్లు

ఎలుకలు, ఉడుములు రంధ్రాలు చేయడం.. వెరసి నీళ్ల విడుదల చేసినప్పుడు గండి గట్టు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. ఏళ్లు గడిచినా జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు కూడా చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాలువకు నీటిని విడుదల చేయడానికి నెల రోజుల ముందే క్షేత్ర స్థాయిలో పరిశీలించి జంగిల్ క్లియరెన్స్, గట్లు బలహీనంగా ఉన్న చోట్ల మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం వల్లే మల్లెంపల్లి వద్ద గండి పడిందనే ఆరోపణలు లేకపోలేదు. 17.2 కిలోమీటర్లు వద్ద ఉన్న యూటీ దగ్గర గట్టు బలహీనంగా మారి గండి పడే ప్రమాదం ఉండడంతో ముందే గుర్తించిన ఇంజనీర్లు సొంత డబ్బుతో మరమ్మతులు చేయించారు. ఇలాంటి ప్రమాదకర ప్రదేశాలు పలు చోట్ల ఉన్నాయని, తక్షణం మరమ్మతులు చేయాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విస్తరణ పేరిట అలసత్వం

హంద్రీ-నీవా కాలువను 6,500 క్యూసెక్కులకు విస్తరిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద అప్రోచ్ కెనాల్ సహా 0/0 కి.మీ. నుంచి 216.300 కి.మీ. వరకు ప్రధాన కాలువ విస్తరణ, అదనపు 8 పంపింగ్ స్టేషన్ల నిర్మాణం పనులు రూ.6,182.19 కోట్లకు 2021 సెప్టంబరు 15న అప్పటి ప్రభుత్వం సాంకేతిక అనుమతులు ఇచ్చింది. రెండు ప్యాకేజీలుగా టెండర్లు పిలిస్తే.. ప్యాకేజీ-1 మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ, ప్యాకేజీ-2 హైదరాబాదుకు చెందిన డీఎస్ఆర్-వీపీఆర్ జాయింట్ వెంచర్ దక్కించుకున్నారు. 2021 డిసెంబరు 31న అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఒప్పంద గడువు 36 నెలలు కాగా.. ఇప్పటికే 32 గడిచిపోయాయి. ఒప్పందం చేసుకున్నా.. గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వదనే భయంతో పనులు చేపట్టలేదనే ఆరోపణలు ఉన్నాయి. మరమ్మతులైనా చేద్దామని సుమారు రూ.50 లక్షలతో ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపితే.. విస్తరణ పనులు చేయడాకి కాంట్రాక్ట్ సంస్థ ఒప్పందం చేసుకుంది.. ఈ సమయంలో మరమ్మతులు ఎలా చేపడుతారు..? అంటూ ఈఎన్సీ ఆఫీసు నుంచి వెనక్కి పంపారు. విస్తరణ పనులు చేయక.. మరమ్మతులు లేక కరువు సీమకు జీవనాడి అయినా హంద్రీ-నీవా అనాథగా మారిందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. అంతేకాదు.. రాష్ట్ర విభజన తరువాత రూ.1,050 కోట్లతో ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం విస్తరణ పనులు చేపట్టింది. కడప జిల్లాకు చెందిన అప్పటి టీడీపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ సంస్థ పనులు చేపట్టింది. రూ.285.77 కోట్లు ఖర్చు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అవినీతి పేరుతో ఆ పనులు ఆపేసింది. దీంతో స్ట్రక్చర్స్ వద్ద ఎగువ, దిగువన 50 మీటర్ల వరకు చేపట్టాల్సిన ప్రొటెక్షన్ పనులు ఆగిపోయాయి. ఆ ప్రాంతాల్లో కాలువకు ప్రమాదం పొంచి ఉందనే ఇంజనీర్లే అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా రాయలసీమ కరువు పల్లెలకు జీవనాడి అయిన హంద్రీ-నీవా కాలువ భద్రత ప్రశ్నార్థకంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు ప్రభుత్వమైనా తక్షణం మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనులైనా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

- హంద్రీ-నీవా కాలువ నిర్వహణపై అలసత్వం
- రూ.6,182.19 కోట్లతో కాలువ విస్తరణ పనులు
- రెండున్నరేళ్ల క్రితమే ఒప్పందం చేసుకున్న కాంట్రాక్ట్ సంస్థ
- మరమ్మతులకు నిధులు ఇవ్వని గత వైసీపీ ప్రభుత్వం
- పలుచోట్ల బలహీనంగా కాలువ గట్లు
- ఆందోళనలో కరువు రైతులు

గండి పూడ్చివేత పనులు పూర్తి చేశాం

వెల్దుర్తి మండలం మల్లెంపల్లి సమీపంలో హంద్రీ-నీవా కాలువకు పడిన గండిని పూడ్చి వేత పనులు పూర్తి చేశాం. కాలువ నిర్వహణ బాధ్యతలు మెఘా ఇంజనీరింగ్ కంపెనీ చేయాల్సి ఉంది. నిర్వహణ గడువు ఇంకా ఉంది. కాలువ గట్టుపై పలు చోట్లు ముళ్లపొదలు ఉన్నమాట నిజమే. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా సుమారు రూ.1,400 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నాం.

- రాంగోపాల్, హంద్రీ-నీవా ప్రాజెక్టు ఎస్ఈ, కర్నూలు



గండిని పూడ్చి ఇసుక బస్తాలు వేసిన దృశ్యం



పత్తికొండ సమీపంలో కాలువ గట్టుపై నిండిపోయిన ముళ్లపొదలు

వ్యవసాయం కార్పొరేట్‌కు ధారాదత్తం

రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య



నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 9: కేంద్రంలో పాలన సాగిస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య అన్నారు. ఆలిండియా కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల సంయుక్త పిలుపులో భాగంగా శుక్రవారం పత్తికొండలో ఆర్డీవో కార్యాలయం ఎదుట, రైతు, ఏఐటీయూసీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ అంటూ నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వి నతి పత్రం ఇచ్చారు. రామచంద్రయ్య మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం మీద 70 శాతం పైబడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. అలాంటి వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాల్సిన పాలకులు కేంద్ర బడ్జెట్‌లో 18 శాతం నుంచి 13 శాతానికి నిధులు కుదించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయ రంగాన్ని సంపన్నులకు ధారాదత్తం చేసేందుకు కుయుక్తులు పనుతున్నారని విమ ర్శించారు. కార్పొరేట్ శక్తులను తరిమికొట్టేందుకు రైతులు పోరాటాలకు స న్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రా జాసాహేబ్, నాయకులు కారెన్న, గురుదాస్, ఏఐటీయూసీ నాయకులు రంగ న్న, నెట్టికంటయ్య, రైతు సంఘం నాయకులు సిద్దు, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠం ప్రాంగణంలో ముత్యాల ముగ్గులు



శ్రీమఠం ప్రాంగణంలో రంగులతో వేసిన ముగ్గులు

మంత్రాలయం, ఆగస్టు 9: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో అందంగా రంగులతో ముగ్గులు వేస్తున్నారు. రాఘవేంద్ర స్వామి 353వ ఆరాధనోత్సవాలు దగ్గర పడుతుండటంతో యేల్కూరు కుటుంబ సభ్యులు శశికాంత్, వెంకటేశ్ శెట్టి, ఫణిరాజశెట్టి, పాండురంగయ్య శెట్టి, లక్ష్మయ్య, ప్రవీణ్‌లు గత 12 ఏళ్ల నుంచి సొంత ఖర్చులతో రంగులు వేయిస్తున్నారు. మఠం ప్రాంగణంలోని నలువైపులా వివిధ రంగులతో 16 రకాల ముగ్గులు వేశారు. గత 15 రోజుల నుంచి సుందరంగా భక్తులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దుతున్నారు. రాత్రి, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల సమయంలో భక్తులు లేని సమయాల్లో భారీ కేడ్లను చుట్టు పెట్టుకుని రంగులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. యేల్కూరు కుటుంబ సభ్యులకు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అభినందించి ఫలపుష్ప శేషవస్త్రం మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 9: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ అధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ కార్డు కలిగిన నిరుద్యోగ యువకులకు మెన్స్ టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పకుమార్ శుక్రవారం ఒక ప్రకనటలో తెలిపారు. 30 రోజుల పాటు శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండి చదవడం, రాయడం వచ్చిన అభ్యర్థులు ఆధార్,రేషన్, విద్యార్హత, బ్యాంక్‌పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో పాటు ఆరు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కనే ఉన్న సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 90007 10508ను సంప్రదించాలన్నారు.

రేపు అగ్రికల్చర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 9: ఉమ్మడి కర్నూలు జిల్లా అగ్రికల్చర్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్‌కు ఎన్నికలు ఈ నెల 11న నిర్వహిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సాయికుమార్ తెలిపారు. ఈ ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల అధికారిగా ప్రకాశం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారిగా కృష్ణా జిల్లా అధ్యక్షుడు పెన్నా రమేష్‌ను నియమించామని కలెక్టరేట్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు పరిశీలకునిగా రాష్ట్ర అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌ను నియమించామన్నారు. ఈ ఎన్నికల్లో అసోసియేషన్, మినిస్టీరియల్, క్లాస్ ఫోర్ సిబ్బంది అందరూ పాల్గొని తమ సమస్యలను ఎవరైతే పరిష్కరించేందుకు ముందడుగు వేస్తారో అటువంటి నాయకులను ఎన్నుకుని సంఘాన్ని బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సాయికుమార్ తెలిపారు.

వైసీపీ కార్యకర్త కుటుంబానికి మాజీ సీఎం జగన్ పరామర్శ

నంద్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి)/మహానంది: మహానంది మండలం సీతారామాపురంలో ఇటీవల హత్యకు గురైన పసుపులేటి సుబ్బరాయుడు కుటుంబాన్ని మాజీ సీఎం జగన్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు కుటుంబ సభ్యులతో జరిగిన ఉదంతంపై ఆరా తీశారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తమ కుటుంబానికి ఇప్పటికి ప్రాణహాని ఉందని జగన్‌కు తెలుపగా, వారికి రక్షణ కల్పిస్తామని చెప్పారు. తమ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని కోరగా చూద్దామంటూ జగన్ మాట దాటవేశారు. వారిని పరామర్శించిన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ ఈ హత్య వెనుక టీడీపీ ప్రజా ప్రతినిధుల హస్తం ఉందని ఆరోపించారు. న్యాయస్థానంలో బాధితుల పక్షాన పోరాడతానని, గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛగా ఉండేందుకు పోలీసులు రక్షణ కల్పించేలా న్యాయస్థానాల నుంచి ఆదేశాల తీసుకువచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.



సుబ్బారాయుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైసీపీ ఎమ్మెల్యే, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

శ్రీశైలంలో కృష్ణమ్మ పరవళ్లు

శ్రీశైలం, ఆగస్టు 9: శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. గత నెల జూలైలో ప్రారంభమైన వరద ప్రవాహంతో క్రమంగా జలాశయం నిండుకుంది. జూలై 29 తేదీన జలాశయం మూడు క్రస్టు గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతుండడంతో శుక్రవారం డ్యామ్ అధికారులు జలాశయం 10 క్రస్టుగేట్లును 14 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 2,89,265 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 40,311 క్యూసెక్కులు మొత్తం 3,29,576 వరద ప్రవాహం వస్తోంది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి 3,92,415 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 883 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 204.3520 టీఎంసీలుగా ఉంది.



35 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు

జిల్లాలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

నంద్యాల క్రైం, ఆగస్టు 9 : ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నేర నివారణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహించినట్లు జిల్లా పోలీస్ కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ మేరకు మట్కా, జూదం, ఇసుక అక్రమ రవాణా, డ్రంకెన్‌డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ వెహికల్ అక్ట్‌ను కట్టుదిట్టంగా అమలు పరచడం తదితర వాటిని నిర్వహించినట్లు వెల్లడించాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో భాగంగా డ్రంకెన్‌డ్రైవ్‌లో భాగంగా రెండు కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఘటనల్లో 35మందిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే మోటార్ వెహికల్ యాక్ట్ అమలు చేస్తూ 137 కేసులు నమోదు చేసి రూ.60,225 జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు. పాణ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొనిదేడు గ్రామం ఊరి బయట పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై అశోక్ తన సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.30,390 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో సెబ్, సివిల్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో అక్రమంగా మద్యం అమ్మే నలుగురిపై కేసు నమోదు చేసి 18.61 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. నాటుసారా బట్టీలపై దాడులు చేసి సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రెండు వాహనాలను సీజ్ చేసి 31 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.38 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం ఆగస్టు 9: మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో శ్రావణ మాసపు ఉత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో కొనసాగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కింపు కొనసాగగా నగదు రూపంలో రూ.38,70,013 వెండి 6.6కిలోలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవాల అధికారి పాండురంగారెడ్డి, హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్, ఏపీజీబీ సిబ్బంది, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల, ఆగస్టు 9: మండల పరిధిలోని హెచ్ కైరవాడి సమీపంలో ఉన్న ఎల్లెల్సీ దగ్గర చిన్నమరివీడు గ్రామానికి చెందిన మిన్నల్ల(50) అనే వ్యక్తి శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మిన్నల్ల గ్రామంలో హోటల్ నడుపుతూ జీవనం సాగించేవాడు. కొన్నేళ్లుగా మిన్నల్ల మానసిక వ్యాధితో బాధపడేవాడు. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. తన రోగం నాయం కాకపోవడం ఇట్లో వాళ్ల పడుతున్న ఆర్థిక ఇబ్బందులను తలుచుకునే బాధ పడేవాడు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మధ్యాహ్నం ఎల్లెల్సీ దగ్గరకు బైక్‌పై వచ్చాడు. కాలువ గట్టుపై బైక్‌పై నిలిపి అక్కడ ఉన్న ముళ్ల పొదల్లోకి వెళ్లి మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పరసర పొలాల దగ్గర ఉన్న రైతులు బైక్‌ను చూసి అక్కడికి వెళ్లారు. అక్కడ ముళ్ల పొదలో మృతి చెందిన వ్యక్తిని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. చిన్నమరివీడు గ్రామానికి చె ందిన మిన్నల్లగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఆశమ్మ, బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు. తెలిపారు.

ఎంపీడీవోలు రిలీవ్

కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 9: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఎంపీడీవోలను తిరిగి గతంలో పని చేసిన ప్రాంతాలకే పంపాలని పీఆర్అండ్ఆర్డీ డైరెక్టర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న ఎంపీడీవోలను అదే జిల్లాలకు రిలీవ్ చేస్తూ జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈ ఏడాది జనవరి 30న ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు 33 మంది, కడపకు ఏడుగురు మొత్తం 40 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో అనంతపురం జిల్లా నుంచి 23 మంది, కడప నుంచి 16 మంది మొత్తం 39 మందిని కర్నూలు, నంద్యాల జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహణకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు.

అడవి పంది దాడిలో మహిళకు గాయాలు

చాగలమర్రి, ఆగస్టు 9: మండలంలోని చింతలచెరువు గ్రామంలో శుక్రవారం అడవి పంది దాడిలో ప్రమీల అనే మహిళ గాయపడింది. పొలంలో వరి నాట్లు వేస్తుండగా అడవి పంది దాడి చేయడంతో గాయపడింది. తనతోపాటు వరి నాట్లు వేస్తున్న మహిళలు కేకలు వేయడంతో అడవి పంది పారిపోయింది. గాయపడిన ప్రమీలను చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. అడవి పందుల బారీ నుంచి అటవీశాఖ వారు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

టీడీపీలో చేరిక



మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరిన బ్రాహ్మణకొట్కూరు వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 9: అల్లూరు గ్రామంలోని మాండ్ర శివానందరెడ్డి నివాసంలో టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే జయసూర్య సమక్షంలో బ్రాహ్మణకొట్కూరు గ్రామ ఎంపీటీసీలు సురేష్, నాగేశ్వరావు టీడీపీలో చేరారు. వీరితోపాటు పాములపాడు మండల ఎంపీపీ తోగూరు వర్ధినమ్మ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణకొట్కూరు నాయకులు ఖాజా బాషా, పుల్లన్న, పాములపాడు మండల నాయకులు రవీంద్రారెడ్డి, వెంకటేశ్వరారావు, గోవిందు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే బుడ్డా అభినందన

ఆత్మకూరు, ఆగస్టు 9: అనంతపురం జిల్లాలోని తాడిపత్రిలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఆత్మకూరు తరుపున పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అభినందించారు. రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారులు ఎమ్మెల్యే బుడ్డాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడలకు ప్రభుత్వం కూడా అధిక ప్రాధాన్యం కల్పిస్తోందని, క్రీడాకారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పస్సేల్‌మున్నా, నాయకులు మోమిన్ హుసేన్, మోమిన్ ఇబ్రహీం ఖలీలుల్లా, ఆసిఫ్, శిక్షకులు ఖాజా, స్వామన్న, ముర్తుజావలి తదితరులు ఉన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్లకు బైరెడ్డి అభినందన



బైరెడ్డిని కలిసిన ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు

నందికొట్కూరు, ఆగస్టు 9: పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లు టీడీపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం నందికొట్కూరులోని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా బైరెడ్డి వారిని అభినందించారు. బైరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు అందించే విధంగా పని చేయాలని సూచించారు.

నంద్యాల తహసీల్దారుగా ప్రియదర్శిని

నంద్యాల (కల్చరల్) ఆగస్టు 9: నంద్యాల మండల అర్బన్ తహసీల్దార్‌గా ప్రియదర్శిని నియమించినట్లు కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలకు ముందు నంద్యాల ఆర్డీవో కార్యాలయ ఏవోగా బాధ్యతలు నిర్వహించి సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ప్రియదర్శినిని నంద్యాల అర్బన్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

గడివేముల తహసీల్దార్‌గా బీవీఎన్ విద్యాసాగర్

గడివేముల, ఆగస్టు 9: గడివేముల మండల తహసీల్దార్‌గా బీవీఎన్ విద్యాసాగర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాటా డుతూ ఎన్నికల విధుల్లో భాగంగా కడప జిల్లా ప్రొద్దుటూరు మండలంలో పని చేశానని అన్నారు. అనంతరం జరిగిన బదిలీల్లో గడివేముల తహసీల్దార్‌గా ఉన్నతాధికారులు నియమించినట్లు తెలిపారు. తహసీల్దార్ బీవీఎన్ విద్యాసాగర్‌కు డిప్యూటీ తహసీల్దార్ గురునాథం, రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఏలు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. మండలంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరానికి కృషి చేస్తానని తహసీల్దార్ చెప్పారు.

'ఎస్డీఆర్ పాఠశాలను సీజ్ చేయాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 9: విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న ఎస్డీఆర్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలోని డీఈవో కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా చేపట్టారు. కార్యాలయంలో డీఈవో లేక పోవడంతో డీఈవో చాంబర్ త లుపులకు వినతి పత్రం ఇచ్చారు. ధనుంజయుడు మాట్లాడుతూ.. పాఠశాల చైర్మన్ కొండారెడ్డి జన్మదిన వేడుకల్లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగి అస్వస్థతకు గురైతే ఘటన పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. సురేష్ రవి, విష్ణు, అంజి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

జూపాడుబంగ్లా, ఆగస్టు 9: జూపాడుబంగ్లా విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై ఆటో, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. నందికొట్కూరు నుంచి ఎరుకలి ఓల్‌మాన్, పారుమంచాలకు చెందిన అరవింద్ ఆటోలో వస్తుండగా, ఎదురుగా కారు ఢీకొంది. దీంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఎస్ఐ లక్ష్మీనారాయణ ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో నందికొట్కూరు ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా అభియాన్

నంద్యాల (కల్చరల్) ఆగస్టు 9: నంద్యాలలోని బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో శుక్రవారం హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కోఆర్డినేటర్ డా.అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హర్‌ఘర్ తిరంగా అభియాన్ జోనల్ కోఆర్డినేటర్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొని కార్యకర్తలకు, నాయకులకు సూచనలు ఇచ్చారు.

శ్రీశైల దేవస్థానానికి ట్రాక్టర్ విరాళం



ట్రాక్టర్‌ను విరాళంగా అందజేస్తున్న ఏపీజీబీ అధికారులు

శ్రీశైలం, ఆగస్టు 9: శ్రీశైలం దేవస్థానానికి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ శ్రీశైలం శాఖ అధికారులు శుక్రవారం ట్రాక్టర్‌ను విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని బ్యాంక్ చైర్మన్ ఎస్. సత్యప్రకాశ్ సింగ్ ట్రాక్టర్‌ను ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజుకు అందజేశారు. ట్రాక్టర్ విలువ రూ.12 లక్షల రూపాయలు అని బ్యాంకు అధికారులు తెలిపారు. ప్రధాన ఆలయం ముందుభాగంలోని గంగాధర మండపం వద్ద ట్రాక్టర్‌కు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులకు దేవస్థానం ఈవో పెద్దిరాజు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. ఈ విరాళం కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రామకృష్ణ, బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

● మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 9: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి పాటు పడాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. నంద్యాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌కు వెల్‌కమ్ డే, విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రితోపాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌లు హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని వివిధ రంగాలలో రాణించాలని, వారికి కావాల్సిన సౌకర్యాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా పాటు పడాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వ అందజేసిన పాఠ్యపుస్తకాలను పంపిణీ



మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

చేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీవీఈవో సునీత, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప, ఉర్దూ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కలీముల్లా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మణియార్ ఖలీల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'నైట్ డ్యూటీలను రద్దు చేయాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 9: వీఆర్ఏలకు నైట్ డ్యూటీలను రద్దు చేయాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగేష్, భూపాల్ కోరారు. నంద్యాలలో డీఆర్వో పద్మజకు ఆ సంఘం నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ అర్హులైన వారికి అటెండర్, వాచ్‌మన్, రికార్డు అసిస్టెంట్, వీఆర్వో పోస్టులలో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అమలవుతున్న విధంగా ఏపీలో కూడా పేస్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

'యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి'

నంద్యాల టౌన్, ఆగస్టు 9: రైతులతో పొలంబడి నిర్వహించడం ద్వారా పంటలో యాజమాన్య పద్ధతులతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని, ఈ పద్ధతులపై రైతులకు సలహాలు ఇవ్వాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి ఏడీఏ రాజశేఖర్ సూచించారు. శుక్రవారం నంద్యాల సబ్ డివిజన్‌లోని బనగానపల్లె, గడివేముల, పాణ్యం, బండిఆత్మకూరు, మహానంది, నంద్యాల మండలాలకు చెందిన ఏఈవోలు, వీఏఏలకు మేలైన వ్యవసాయ పద్ధతులతో పొలంబడి కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి మండలంలో ఒక మేలైన వ్యవసాయ పద్ధతులతో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పొలంబడికి సంబంధించి గ్రామంలో సభలు నిర్వహించడం, పంటను ఎంపిక చేసుకొని ఎంపిక చేసే పంట వేసే రైతులను 30 మందిని ఎంపిక చేసుకొని వారితో స్థానిక ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో) మహానంది అరటి ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ద్వారా రిజిస్టర్ చేయించాలని అన్నారు. ప్రతి వారం ఒక రోజు పంట విత్తే సమయం నుంచి పంట కోత వరకు అవగాహన కల్పించేందుకు రైతులతో పొలంబడి సమావేశాలు నిర్వహించి మేలైన యాజమాన్య పద్ధతులను వివరించాలని ఆదేశించారు. సమావేశంలో మహానంది అరటి ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సీఈవో, ఎఫ్‌పీవో సభ్యులు, 6 మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



మహానంది చెంచుగూడెంలో ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకుడు

మహానంది, ఆగస్టు 9: మహానంది సమీపంలోని చెంచుగూడెంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం మహానంది టీడీపీ నాయకుడు సూరే శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గిరిజనుల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం ముందు ఉంటుందని చెప్పారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సహకారంతో చెంచుగూడెంలోని సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. అనంతరం టీడీపీ నాయకుడిని గిరిజనులు శాలువాతో సన్మానించారు.

వెలుగోడు: ఆదివాసీల అస్థిత్వాన్ని కాపాడుకుందామని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు అన్నారు. శుక్రవారం గిరిజన చెంచు గూడెంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. నరసింహులు మాట్లాడుతూ ఆదివాసీలు ఎలాంటి అభివృద్ధి నోచుకోకుండా అనాదిగా అడవుల్లోనే పుట్టి, పెరిగి అడవుల్లోనే జీవిస్తున్నారన్నారు. నాగరిక ప్రపంచానికి దేరంగా ఉండి కొండ కోనల్లో ప్రత్యేక భాష, సంస్కృతి వేషధారణ కలిగిన ఆదివాసీల అస్థిత్వాన్ని కాపాడాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో నేటికీ రోడ్లు, విద్య వైద్య సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారు అనారోగ్యానికి గురైతే నేటికి డోలీలు కట్టుకుని సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రులకు రావాల్సిన దుస్థితి ఉందన్నారు. ఆదివాసీల మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన అటవీ సవరణ చట్టాన్ని ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్, గోపాల్, లాలు నాయక్, క్రిష్ణ చెంచులు భూదేవి, గొలుసన్న, ఈరమ్మ, ఈదన్న, లింగమ్మ, అంకన్న తదితరులు పాల్గొన్నారు.

తరిగోపులలో 'పొలం బడి'

జూపాడుబంగ్లా, ఆగస్టు 9: తక్కువ పెట్టుబడితో అధిక లాభాలతోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఏవో కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తరిగోపుల గ్రామంలో శుక్రవారం మొక్కజొన్న పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని రైతులకు సూచించారు.

'ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించుకుందాం'

ఆత్మకూరు, ఆగస్టు 9: ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించు కుందామని సీపీఎం అనుబంధ ప్రజాసంఘాల నాయకులు వీరన్న, స్వాములు, రామ్‌నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాల యం ఎదుట ఆయా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనం తరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వేస్ తదితర వాటిని ప్రైవేట్ వ్యక్తులకు చౌకగా అప్పగించడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్ర పెద్దలు ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రణధీర్, కిరణ్, జబీవుల్లా, షబ్బీర్, హుసేన్, అల్తాఫ్, ముర్తుజావలి ఉన్నారు.

'పంట నమోదు తప్పనిసరి'

నంద్యాల రూరల్, ఆగస్టు 8: పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ నుంచి వచ్చే పథకాలు వర్తిస్తాయని, రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని పుసులూరు, కానాల గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. పొలాలకు వెళ్లి పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పంట నమోదు మేరకు పంటనష్టం, బీమా, మద్దతు ధరలపై పంటల కొనుగోలు జరుగుతాయన్నారు. పంట నమోదులో వాస్తవ సాగుదారు రైతులను గుర్తించి పేర్లు నమోదు చేయాలన్నారు. సెప్టెంబరు 10వ తేదీలోపు వంద శాతం పంట నమోదు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల రూరల్, ఆగస్టు 9: నంద్యాల పట్టణంలోని ఎన్జీఓస్ కాలనీ, ఎస్బీఐ కాలనీ, పద్మావతి నగర్, అయ్యలూరు మెట్ట తదితర ప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డి2 ఏఈ రామయ్య తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాణ్యం: మండలంలోని గోనవరం, అలమూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి సుందర్‌రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 220 కెవి సరఫరా పనుల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో ముస్లింలకు నష్టం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుసేన్



నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 9: వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు ఎంతో నష్టం వాటిల్లుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుసేన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లులో 40 అంశాల మార్పు చేశారని, ప్రవేశ పెట్టిన బిల్లులో ముస్లిం సమాజానికి 16 అంశాలపై అనుమానం ఉందని, వాటిని పరిశీలించాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కూటమి పాలనలో ఏ ఒక్క మత విశ్వాసులకు భంగం కలుగ నీయమని, బిల్లుపై కూటమి పార్లమెంట్ సభ్యులు అవగాహన చేసుకుని వక్ఫ్ ఆస్తుల భద్రతకు పాటు పడతామని సీఎం తెలిపారన్నారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉందని చెప్పారు.

పశువుల యజమానులకు నోటీసులు

నంద్యాల టౌన్, ఆగస్టు 9: నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఆవులు, వివిధ రకాల పశువులను నియంత్రించేందుకు వాటి యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ టి.నిరంజన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులను విచ్చల విడిగా వదిలి వేయడం ద్వారా అవి రోడ్లపైనే నిద్రించడం, రోడ్లపై రాకపోకలు సాగించేవారికి, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. ఐదు నెలల క్రితం యజమానులకు నోటీసులు జారీ చేశామని, వారి ఇళ్ల వద్దనే పాకలు ఏర్పాటు చేసుకొని సంరక్షించుకోవాలని ఆదేశించామని చెప్పారు. తిరిగి ప్రస్తుతం నోటీసులు జారీ చేస్తున్నామని, వారం రోజులలోగా యజమానులందరూ తమ తమ పశువులను తీసుకెళ్లి ఇంటి వద్దనే సంరక్షించుకోవాలని తెలిపారు. లేని పక్షంలో ఆవులను, పశువులను గోశాలకు తరలిస్తామని చెప్పారు.

'సాటి మనిషిని గౌరవించాలి'

పాణ్యం, ఆగస్టు 9: సాటి మనిషిని గౌరవించాలని కేరళ కొచ్చిన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే యూనివర్సల్ హ్యూమన్ వ్యాల్యూస్ అంశంపై సదస్సు శుక్రవారం ప్రారంభించారు. కళాశాలకు చెందిన 110 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ విలువలు తగ్గి మనిషి ఆశా జీవిగా మారాడని అన్నారు. విలువలు లేని జీవితం తెల్లకాగితం లాంటిదన్నారు. డబ్బు ఉండి మానవత్వం చూపించే మనుషులే విలువైనవారన్నారు. సాటి మనుషుల పట్ల జాలి, దయ, సహాయం చూపించాలన్నారు. నేడు డబ్బుకు ఇచ్చే విలువ మానవత్వానికి లేదన్నారు. సహాయం చేసిన మనిషిని మరిచిపోవడం మానవత్వం కాదన్నారు. తనకు ఉన్న దానిలో ఇతరులకు సాయం చేయాలన్నది ప్రతి మతం బోధిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డాక్టర్ రామిరెడ్డి, కోఫెసిలిటేటర్ డాక్టర్ శేషమహేశ్వరమ్మ, పరిశీలకులు డాక్టర్ శ్రీశైలం, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన టీడీపీ నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 9: ఆత్మకూరు డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆర్.రామాంజినాయక్‌ను శుక్రవారం టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా పోలీసుశాఖ తరుపున ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

కోదండరాముడికి వెండి పూజా సామగ్రి



ఈవో శ్రీనివాసరెడ్డికి వెండి పూజా సామగ్రి అందజేస్తున్న దాతలు

మహానంది, ఆగస్టు 9: మహానంది క్షేత్రంలోని కోదండ రాముడి ఆలయానికి స్థానిక వ్యాపారి భవనాశి ఎల్లయ్య సుధామణి దంపతులు 871 గ్రాముల బరువుగల రెండు వెండి దీపాలను ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి అందజేశారు. శుక్రవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో దాతల తరుపున కుమారుడు సోమశేఖర్ ఆలయ ఈవోకు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, క్యాషియర్ బత్తుల నాగభూషణం, అర్చకులు మణికంఠశర్మ పాల్గొన్నారు.

వైభవంగా నాగ పంచమి

నంద్యాల (కల్చరల్) ఆగస్టు 9: నంద్యాలలో శుక్రవారం నాగ పంచమి పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయాన్నే పట్టణంలోని మద్దిలేటి స్వామి ఆలయంలో, టెక్కె, పాలిటెక్నిక్ కాలేజి, ఆత్మకూరు బస్టాండు, నందమూరినగర్, బంగారుపుట్ట, నాగలింగేశ్వరాలయం, సంజీవ నగర్ కోదండ రామాలయం, నూనెపల్లె, బాల అకాడమీ విద్యాసంస్థలోని పుట్టవద్ద, తదితర ప్రాంతాలలో నాగులకు పాలుపోసి, కాయ కర్పూరం సమర్పించి పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో, తమ ఇళ్ల వద్ద నోములు నోచుకొని బ్రాహ్మణులకు వాయనం సమర్పించారు.

ఆత్మకూరు: శ్రావణశుద్ధ పంచమిని పురస్కరించుకుని శుక్రవారం నాగులపంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు ఆయా ఆలయాల్లోని నాగులకట్టకు, గ్రామశివార్లలో ఉండే పుట్టలకు చేరుకొని విశేష పూజలు నిర్వహించారు. నాగులచవితి పండుగ ఆనవాయితీ ప్రకారం నాగులకట్టకు కొబ్బరి గిన్నెల ద్వారా పాలతో అభిషేకించారు. పట్టణంలోని ఆయా ఆలయాల్లో కొలువుతీరిన నాగులకట్టల వద్దకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అలాగే తోటగేరి ప్రాథమిక పాఠశాల సమీపంలోని నాగుల పుట్టవద్దకు మహిళలు చేరుకొని పూజలు చేపట్టారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

నంద్యాల (కల్చరల్) ఆగస్టు 9: కళారాధన నంద్యాల ఆధ్వర్యంలో దేశ స్వాతంత్ర్య వేడుకలను పురష్కరించుకొని శుక్రవారం నంద్యాల టౌన్ హాల్ ప్రాంగణంలో జూనియర్, సీనియర్ విభాగాలలో జరిగిన తెలుగు, ఆంగ్లం, హిందీ వక్తృత్వ పోటీలలో బాలలు చక్కటి ఉపన్యాసాలు ఇచ్చి ప్రతిభ కనబరిచారు. తెలుగులో "యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఒక గొప్ప వ్యక్తి" హిందీలో "ఆదర్శప్రాయమైన విద్యార్థి" ఆంగ్లంలో "ప్రజాస్వామ్యంలో ఓటు యొక్క ప్రాధాన్యత" అన్న అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో కలిపి 200 మందికిపైగా విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. కళారాధన ప్రధాన కార్యదర్శి డా.రవికృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, న్యాయ నిర్ణేతలుగా అస్సెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, సుజాత, గోపాల్, నీలకంఠమాచారి నిర్వాహకులు రమేష్, రంగనాద్,మజీద్, హర్ష, కిషోర్ పోటీలు పర్యవేక్షించారు.

'నిర్లక్ష్యం వీడాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 9: రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ అన్నారు. బీజేపీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం నంద్యాలలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాజశేఖర్, శంకర్, సోమన్న, శ్రీనివాసులు, శంకరయ్య తదిరతులు పాల్గొన్నారు.

అడవి పందుల బీభత్సం

● దెబ్బతిన్న మొక్కజొన్న పంట



దెబ్బతిన్న మొక్కజొన్న పంట

ఆత్మకూరు, ఆగస్టు 9: మండలంలోని కరివేన గ్రామ శివార్లలోని మొక్కజొన్న పంటలో అడవి పందులు బీభత్సం సృష్టించాయి. గురువారం రాత్రి అడవి పందుల మంద మొక్కజొన్న పంటలోకి ప్రవేశించి పంటనంతా నాశనం చేశాయి. దీంతో గ్రామంలోని కృష్ణా, రమణ అనే రైతులకు చెందిన దాదాపు మూడెకరాల వరకు మొక్కజొన్న పైరు పూర్తిగా దెబ్బతింది. పంట కంకి దశలో ఉందని, ఈ సమయంలో తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు తమకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పంటపొలాల వైపు అడవిపందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం, ఆగస్టు 9: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్ర నామార్చన పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు.

అంకాలమ్మకు విశేష పూజలు

శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు.

మహానందిలో పల్లకీ సేవ

మహానంది, ఆగస్టు 9: మహానంది లో శుక్రవారం రాత్రి ఘనంగా పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని కల్యాణ మంటపంలో పల్లకిలో స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆశీనులు చేశారు. అనంతరం వేదపండితులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ సేవను ఆలయం ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవో నెంబర్ 217 రద్దుపై హర్షం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మత్స్యకారులు

వెలుగోడు, ఆగస్టు 9: మత్స్యకారుల ప్రయోజనాలకు విఘతం కలిగేలా వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 217ను టీడీపీ ప్రభుత్వం రద్దు చేయడం పట్ల మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శుక్రవారం వెలుగోడులోని టీడీపీ కార్యాలయంలో మత్స్యకారులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మత్స్యకారులకు ఎంతో ప్రయోజయోనం కలిగించే జీవో నంబర్ 217ను టీడీపీ ప్రభుత్వం రద్దు చేయడం పట్ల కూటమి ప్రభుత్వానికి, నాయకులకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేషిరెడ్డి, ఖలీలుల్లా ఖాన్, హిదాయత్ అలీఖాన్, మోమిన్ రసూల్ ముర్తుజా, జనసేన పార్టీ నాయకులు షాలు బాషా, మత్స్యకారులు తెలుగు బుడ్డన్న, తెలుగు రమణ, రామాంజనేయులు తెలుగు మధు, జయరాం లు పాల్గొన్నారు.

'పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం'

ఆత్మకూరు రూరల్, ఆగస్టు 9: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు పవన్‌కుమార్, గోపాల్‌లు పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని బైర్లూటి పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద 45 మంది గర్భిణీ స్త్రీలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార సమతుల్యంపై అవగాహన కల్పించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే సురక్షితమని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. అలాగే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆశాలు గర్భిణులను ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జననీ సురక్షయోజన పథకం, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ తదితర ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్కానింగ్ పరీక్షల నిమిత్తం నలుగురిని గుర్తించి ఆత్మకూరు సీహెచ్‌సీకి రెఫర్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'

వెలుగోడు, ఆగస్టు 9: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రముఖ పారిశ్రామికవేత్త, వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి మద్దెల శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ సంఘం విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గార్డెన్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కనీసం ఐదు మొక్కలు నాటి వాటిని కాపాడాలన్నారు. రోజురోజుకూ వాతావర ణ కాలుష్యం ఏర్పడి ఓజోన్ పొర దెబ్బతింటోందన్నారు. మొక్కలు నాటి పెంచి తే సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండుతాయన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు రామలింగారెడ్డి, సభ్యులు జయరాం రెడ్డి, నస్రుల్లా ఖాన్, సుల్తాన్ మొహిద్దీన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, మురళి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య



తాగునీటి కోసం బయటికి వెళ్తున్న విద్యార్థులు

పాణ్యం, ఆగస్టు 9: పాణ్యంలోని ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. శుక్రవారం విద్యార్థులు తాగునీటి కోసం బయటికి వెళ్లినట్లు తెలిసింది. విద్యుత్ సమస్య కారణంగా తాగునీరు లేదని ప్రిన్సిపాల్ కృష్ణానాయక్ తెలిపారు. కాగా పాఠశాలలో రెండు రోజులుగా తాగునీరు, పారిశుధ్య సమస్యలు ఏర్పడ్డా ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టలేదని ప్రజా సంఘాల నాయకులు ప్రతాప్ ఆరోపించారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

'సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి'



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి

చాగలమర్రి, ఆగస్టు 9: ఆంధ్రరాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఈశ్వర వెంకటప్రసాద్ సూచించారు. మండలంలోని ఒంటిగుడిసె తండాలో శుక్రవారం న్యాయ సేవా సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. న్యాయ విజ్ఞాన సదస్సుపై అవగాహన కల్పించారు. చట్టాలు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్యులు శబరిస్, తస్లీమ్ సుల్తాన గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ బాలీశ్వర్‌రెడ్డి, ఎస్ఐ రమణయ్య, పీపీ సోమశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది నీలకంఠం, ప్యానల్ లాయర్ షాహినాబేగం, గౌస్, ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సీహెచ్‌వో కృష్ణమ్మ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పుట్టాలమ్మకు ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, ఆగస్టు 9: మండలంలోని ఆర్.క్రిష్ణాపురం గ్రామంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మకు శుక్రవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిల ప్రియ పూజలు చేశారు. ఆమెకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం పుట్టలో పాలు పోసి పూజలు చేయడం ఎంతో మంచిదని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు వేదపండితులు ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలను అందించారు.

బేతంచెర్ల: బేతంచెర్ల- బనగాన పల్లె రహదారిలోని గిన్నెమిల్లుకు సమీపంలో వెలసిన పుట్ట పెద్దమ్మకు భక్తులు శ్రావణ మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పురోహితుల ఆధ్వర్యంలో కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



టీఈ కేశన్నగౌడును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

డోన్, ఆగస్టు 9: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి పరుగులు పెడుతుందని డోన్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో కేశన్నగౌడును వెంకటాపురం టీడీపీ నాయకులు పెద్దయ్య, శేఖర్ ఆధ్వర్యంలో పాఠశాలల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ భానుప్రకాష్‌లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కేశన్నగౌడు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు గోసా నిపల్లి శ్రీరాములు, కొచ్చెర్వు మల్లికార్జున, అశోక్ పాల్గొన్నారు.

కొలిమిగుండ్లలో 30.8 మి.మీ. వర్షం

కొలిమిగుండ్ల, ఆగస్టు 9: మండలంలోని గ్రామాల్లో 30.8మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ బాస్కరరెడ్డి శుక్రవారం తెలిపారు. గత నెల రోజులుగా వాన లేకపోవడంతో మండలంలోని గ్రామాల్లో పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో గురువారం కురిసిన చిన్నపాటి వర్షం సాగు చేసిన పంటలకు కొం తైనా ఊరటనిచ్చింది.

తల్లి, పిల్లల సంరక్షణపై ప్రచారం

కొలిమిగుండ్ల, ఆగస్టు 9: తల్లి, పిల్లల సంరక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకవచ్చిందని ఏఎన్ఎంలు ఉమామహేశ్వరి, రోజమ్మ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, పుట్టిన పిల్లల కోసం అందించే టీకాలు, పౌష్టికాహారం తదితర వివరాలను తెలుసు కోవడానికి ప్రభుత్వం 0124-4451660 టోల్‌ఫ్రీ నంబరును ప్రవేశపె ట్టిందన్నారు. ఈ నంబర్‌పై గ్రామాల్లో మహిళలకు విస్తృత అవగా హన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

కోవెలకుంట్ల, రేవనూరు ఎస్ఐలు బదిలీ

కోవెలకుంట్ల, ఆగస్టు 9: కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలోని కోవెలకుంట్ల, రేవనూరు పోలీసుస్టేషన్లలో పనిచేసే ఎస్ఐ వర ప్రసాద్, ఎస్ ఐ రామ్మోహన్‌రెడ్డిలు శుక్రవారం బదిలీ అయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఎస్ఐ వర ప్రసాద్ గడివేముల పోలీసుస్టేషన్‌కు, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి వెలుగోడు పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు. కోవెలకుంట్ల, రేవనూరు పోలీసుస్టేషన్లకు ఇంకా ఎస్ఐలను నియమిం చలేదు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

అవుకు, ఆగస్టు 9: గిరిజన సమస్యలను జిల్లా ఉన్నతాధికారులు పరిష్కరించాలని ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్షు డు వెంకట రమణానాయక్ కోరారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెం కట రమణనాయక్ మాట్లాడుతూ తండాల్లోని గిరిజనులు కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోక దుర్భర జీవితాలను గడుపుతున్నా రని అన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్, గిరిజన సంక్షేమశాఖ అధికారులు వెంకట రమణనాయక్‌కు శాలువ కప్పి సన్మానించారు.

గుండెను భద్రంగా ఉంచుకోవాలి

సంజామల, ఆగస్టు 9: గుండెను భద్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటీ వైద్యశాల గుండె వైద్యులు డాక్టర్ మంజన్‌షా వలి హృద్రోగులను కోరారు. శుక్రవారం సంజామల టీడీపీ కార్యాలయంలో శాంతిరాం వైద్యులు, సిబ్బంది ఉచితంగా గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీఎకో పరీక్షలను ఉచితంగా చేశారు. అవసరమైన వారికి నంద్యాల శాంతిరామ్ వైద్యశాలకు రెఫర్ చేశారు.

12 నుంచి శిక్షణ

రుద్రవరం, ఆగస్టు 9: రుద్రవరం మండలంలో ఈ నెల 12 నుంచి సర్పంచ్‌లు కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ ఇస్తున్నట్లు ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ శుక్రవారం తెలిపారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు వారికి కేటాయించిన తేదీల్లో శిక్షణ తరగతలకు హాజరు కావాలని కోరారు. ఈ శిక్షణ తరగతుల్లో సర్పంచ్‌లు కార్యదర్శులకు అన్నివిధాలుగా పంచాయతీ అభివృద్ధికి గాను సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

'విశ్వకర్మ దరఖాస్తులను అప్‌లోడ్ చేయండి': మండలంలోని గ్రామ సచివాలయాల్లో సర్పంచ్‌ల లాగిన్‌లో విశ్వకర్మ దరఖాస్తులు ఉన్నాయని, వాటిని అప్‌లోడ్ చేయాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ తెలిపారు. శుక్రవారం రుద్రవరం సచివాలయం తనిఖీ చేశారు. రికార్డులు అప్‌డేట్ చేయాలని సూచించారు.

కార్పొరేట్ కంపెనీలను తరిమి కొట్టండి

● రైతు, కార్మిక సంఘాల నాయకులు

బేతంచెర్ల, ఆగస్టు 9: కార్పొరేట్ కంపెనీలను దేశం నుంచి తరిమికొట్టాలని రైతు కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని రైతు సంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పాతబస్టాండులో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి పోస్టుమా స్టర్ నరసింహులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు భార్గవ్, మధుశేఖర్, రైతు సంఘం మండల కార్యదర్శి రామ్మోహన్, సీపీఐ మండల సహాయ కార్యదర్శులు తిరుమలేష్, దస్తగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఏలియా, నాయకులు కిష్టన్న, రామచంద్రుడు, సర్వోత్తమ రెడ్డి, ఎల్లకృష్ణ, గోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): కార్పొరేట్ కంపెనీలను దేశం నుంచి తరిమికొట్టి వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలని రైతు సంఘం గౌరవాధ్యక్షులు కోయలకొండ నాగరాజు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రంగనాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోందని, వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు.



బేతంచెర్లలో నిరసన తెలుపుతున్న నాయకులు



డోన్‌లో..

బెస్తలకు న్యాయం చేయాలి



మంత్రి బీసీని కలిసిన టీడీపీ బెస్త సాధికార కమిటీ నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యుడు గురప్ప

కోవెలకుంట్ల, ఆగస్టు 9: బెస్తలకు న్యాయం చేయాలని టీడీపీ బెస్త సాధికార కమిటీ నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎంవీ గురప్ప అన్నారు. శుక్రవారం బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దనరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గురప్ప మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో దాదాపు 20వేల మంది బెస్తకులస్తులు ఉన్నారన్నారు. కుందూ నది బెస్తకులస్తుల జీవనాధారమని, ప్రస్తుతం కుందూ నది స్వరూపం మారిపోకుండా చూడాలని కోరారు. అలాగే బెస్త కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రతిపాదనలు ప్రవేశపెట్టి తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే టీడీపీలో బెస్తలకు ప్రాధాన్యతనిచ్చి రాష్ట్ర నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించాలని కోరారు. బెస్తలు చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారని సాంప్రదాయ మత్స్యకారులైన బెస్తలకు నదులు, కుంటలు, రిజర్వాయర్లపై బెస్త కులస్తులకు మాత్రమే హక్కు కల్పించాలని కోరారు. అలాగే జనాభా నిష్పత్తి ప్రకారం బెస్తలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు అందించాలని మంత్రిని కోరారు. బెస్తకులస్తుల పొట్టకొట్టే 217 జీవోను రద్దు చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు, మంత్రి బీసీ జనార్దనరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సీమకు సాగు,తాగు నీరు అందించాలి: సీపీఐ

డోన్(రూరల్), ఆగస్టు 9: రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగు నీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనా యుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పా టు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు పూర్తయితే.. ఆదా అయ్యే కృష్ణా జలాలు నిల్వ ఉంచుకునేందుకు సరైన రిజర్వాయర్లు లేకపోవడం బాధాకరమన్నారు. ఏనాడో కట్టిన సుంకేసుల ప్రాజెక్టు, వెలుగోడు, అలగనూరు రిజర్వాయర్లు తప్ప కొత్త ప్రాజెక్టులు లేకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య, రాధాకృష్ణ, పట్టణ మండల కార్యదర్శులు నారాయణ, వరదరాజులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

సమస్యలపై చర్చించని వైసీపీ సభ్యులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 9: కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నాగవేణి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. వైసీపీకి చెందిన కొలిమిగుండ్ల జడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికై జడ్పీ చైర్మన్‌గా ఉన్న ఎర్రబోతుల పాపిరెడ్డి సభకు హాజరు కాలేదు. ఇక వైసీపీకే చెందిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, అధిక సంఖ్యలో సర్పంచ్‌లు ప్రజా సమస్యలను చర్చించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లేసి ప్రజలు వైసీపీకి అధికారం కట్టబెడితే మండల సమావేశంలో కనీసం గ్రామాల్లో ప్రజల సమస్యలు ప్రస్తావించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభకు హాజరై, సంతకాలు చేసి కొందరు వెళ్లిపోగా, మరికొందరు ప్రజల సమస్యలపై చర్చించడం బాధ్యత కాదు అన్న రీతిలో కూర్చుండిపోయారు. దీంతో అధికారులు సభ ప్రారంభమైన గంట, గంటన్నరలోపే ముగించి మమ అనిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి, ఎంపీపీ నాగవేణి, వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, డా.పద్మావతి, డా.హరిచరణ్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి

చౌడేశ్వరీ దేవికి వెండి కానుకలు



అమ్మవారికి వెండి బకెట్‌ను సమర్పిస్తున్న భక్తులు

బనగానపల్లె, ఆగస్టు 9: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవికి భక్తులు వెండి కానుకలను శుక్రవారం సమర్పించారు. రాజారామ్ దంపతులు వెండి బకెట, ముష్ఫూరి నరేష్ దంపతులు వెండి వడ్డాణం ఆలయ అర్చకులకు అందజేశారు. అలాగే శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు.

బాలికల విద్య దేశానికే వెలుగు

సంజామల, ఆగస్టు 9: బాలికల విద్య దేశానికే వెలుగు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ అన్నారు. శుక్రవారం ఆల్వకొండ అంగన్ వాడీ కేంద్రంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కిశోర బాలికలు ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలు ఆడపిల్లల చదువు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శశిదేవి, పుల్లమ్మ, ఆశా వర్క ర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

కోట్ల కుటుంబాన్ని విమర్శించే అర్హత బుగ్గనకు లేదు: టీడీపీ

బేతంచెర్ల, ఆగస్టు 9: కోట్ల కుటుంబాన్ని విమర్శించే అర్హత మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి లేదని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అధ్యక్షత విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు పోలూరు రాఘవరావు మాట్లాడారు. మంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధి పనుల్లో పర్సంటేజీలు తీసుకున్న బుగ్గనకు కోట్ల కుటుంబాన్ని విమర్శించే అర్హత లేదని అన్నారు. డోన్ నియోజకవర్గంలోని అధికారులు, కాంట్రాక్టర్లు కోట్లను మర్యాదపూర్వకంగా కలుస్తున్నారే తప్ప ఆయన పిలిపించుకోవడం లేదన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఎల్లనాగయ్య, టీడీపీ పట్టణ కార్యదర్శి షేక్షావలి చౌదరి, భీమేశ్వర్ రెడ్డి, తిరుమలేష్ చౌదరి, మేకల నాగరాజు, బుగ్గన ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

అల్లరిమూకలపై ప్రత్యేక నిఘా: సీఐ

డోన్(రూరల్), ఆగస్టు 9: పట్టణంలో అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ పట్టణంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

● **ఎస్ఐగా మమత:** డోన్ పట్టణ ఎస్ఐగా మమత శుక్రవారం రాత్రి బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి బదిలీ కావడంతో కర్నూలు మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ ఐగా పని చేస్తున్న మమతను డోన్ పట్టణ ఎస్ఐగా బదిలీ ఉత్తర్వు లు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆమె శుక్రవారం బాధ్యతలు చేప ట్టారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి భూమి పూజ

ఆళ్లగడ్డ, ఆగస్టు 9: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం నిర్మాణానికి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు శుక్రవారం వేదపండితులతో భూమి పూజ నిర్వహించారు. అహోబిలం నల్లా గెస్ట్ హౌస్ పక్కన నిర్మాణానికి సంఘం నాయకులు చిన్నపుల్లయ్య ఆచారి, శ్రీనివాస ఆచారి, పెద్దసుబ్బయ్య ఆచారి వేదమంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి సంఘం నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కారానికి కృషి: ఆర్డీవో

చాగలమర్రి, ఆగస్టు 9: చిన్నవంగలి గ్రామంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఎస్సీ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీవో మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నవంగలి గ్రామంలోగల ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, భవన స్థితిగతుల గురించి పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతగల భోజనం అందించాలని సూచించారు. రాత్రి వేలలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ మౌలిబాషా, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏవో రాజేంద్రప్రసాదు, వీఆర్వో సుబ్బరాయుడు, కార్యదర్శి నాగార్జున, హాస్టల్ వార్డెన్ ఖాశీంవలి ఉన్నారు.

● చిన్నవంగలి గ్రామంలోగల ఎస్సీ హాస్టల్‌ను శుక్రవారం ఎంఈవో అనూరాధ తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మౌలిక వసతుల కల్పనపై శిక్షణ

సంజామల, ఆగస్టు 9: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు 3రోజులపాటు శిక్షణ ఇవ్వను న్నట్లు ఎంపీడీవో విజయ్ కుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి 14 వరకు మండల పరిషత్ కార్యాలయంలో కార్యాల య సమావేశ భవనంలో శిక్షణ ఉంటుందన్నారు. గ్రామాల అభివృద్ధి, కనీస మౌలిక వసతులు, పన్నుల రాబడి తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు.

వైభవంగా నాగ పంచమి

దొర్నిపాడు, ఆగస్టు 9: మండలంలోని ఆయా గ్రామాల్లో నాగులపంచమి వేడుకలను మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుట్టల వద్ద, నాగుల విగ్రహాల వద్ద పాలు పోసి పూజలు చేశారు. గ్రామాల్లోని పుట్టల వద్దకు అధిక సంఖ్యలో మహిళలు నువ్వుల పిండి, సలిపిండి, టెంకాయ, పాలు, పసుపు, కుంకుమ, గాజులు, చీర సారె ఉంచి భక్తితో పూజించారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని గుంతపాలెం వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన నాగదేవత విగ్రహాలకు శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు నాగదేవతలకు పాలు పోసి పిండి పదార్థాలను సమర్పించారు. మహిళలు సామూహికంగా నాగదేవత, వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. శ్రావణ శుక్రవారం రోజున నాగుల పంచమి రావడం ఎంతో పవిత్రమైనదని వేద పండితుడు ఆనంద్‌శర్మ అన్నారు. కార్యక్రమంలో దాతలు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



దొర్నిపాడులో పూజలు చేస్తున్న మహిళలు

కుందూలో పెరిగిన నీటి ఉధృతి

12 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం

చాగలమర్రి, ఆగస్టు 9: చాగలమర్రి మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూనది శుక్రవారం ఉగ్రరూపం దాల్చింది. ఆనకట్ట వద్ద 12 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. 33.3 మీ.మీ. వర్షపాతం నమోదు కావడంతో కుందూ నీటి ప్రవాహం పెరిగింది. ఎగువ నుంచి వచ్చిన వరద నీరు ఆనకట్టకు చేరడంతో నీటి ప్రవాహం పెరిగిందని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. గత వారంలో కృష్ణా జలాలు 8 వేల క్యూసెక్కులు ఆనకట్టకు చేరడంతో కేసీ కాలువకు నీరు విడుదల చేశామని చెప్పారు. ప్రస్తుతం కేసీ కాలువకు 750 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. ఆనకట్టవద్ద గేట్లను ఎత్తి కడప జిల్లా వైపుగల కుందూనదికి వరద నీటిని విడుదల చేశామని అన్నారు. కుందూ పరిసర గ్రామాల రైతులు, కూలీలు నది దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.



రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

మంత్రి బీసీ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి: ఎస్ఈ

అవుకు, ఆగస్టు 9: అవుకు రిజర్వాయర్ వద్ద నిర్వహిస్తున్న గంగమ్మకు జలహారతి కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం అవుకు వస్తుండటంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్సార్బీసీ ఎస్ఈ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబు, డీఈలు బాబ్జి, శిఖామణితో కలిసి రిజర్వాయర్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ గోరుకల్లు నుంచి జీఎన్ఎస్ఎస్ ద్వారా 11వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ నుంచి 660 క్యూసెక్కుల నీరు వచ్చి రిజర్వాయర్‌కు చేరుతుందన్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 4.148 టీఎంసీలు కాగా శనివారానికి 3.50 టీఎంసీలు నీరు చేరే అవకాశం ఉందన్నారు. రిజర్వాయర్‌లో జలకళ సంతరించుకున్న వేళ రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు వద్ద గంగమ్మకు జలహారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

డోన్ తహసీల్దార్‌గా నాగమణి

డోన్, ఆగస్టు 9: డోన్ తహసీల్దార్‌గా నాగమణిని నియమిస్తూ శుక్రవారం రాత్రి కలెక్టర్ రాజకుమారి గణియా ఉత్తర్వులు జారీ చేశారు. డోన్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న సత్యదీప్‌కు ఫుల్ అడిషినల్ చార్జితో తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్‌గా సత్యదీప్ బాధ్యతలు తీసుకున్న మరుసటి రోజునే డోన్ తహసీల్దార్‌గా నాగమణిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

చాగలమర్రి, ఆగస్టు 9: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి, కోదండరామ ఆలయాల్లో శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు వరలక్ష్మీదేవికి పండ్లు, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సామూహికంగా వరలక్ష్మి వ్రతాన్ని చేపట్టారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానీదేవి, ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, సభ్యులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి పూజలు

రుద్రవరం, ఆగస్టు 9: రుద్రవరంలో కొలువుదీరిన కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం తొలి శుక్రవారం అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రుద్రవరంలో కొలువుదీరిన చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్యాపిలి, ఆగస్టు 9: పట్టణంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాలు అర్పించారు. మండల ఎరుకుల సంఘం నేతల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. గోపాల్, సుంకన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నేరవేర్చడానికి సీఎం సిద్ధం

ప్యాపిలి, ఆగస్టు 9: ఎన్నికల హామీలను నెరవేర్చడానికి సీఎం సిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకులు టి.శ్రీనివాసులు, రామ్మోహన్‌యాదవ్, ఖాజాపీర్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఆర్థిక మంత్రి టీడీపీ ప్రభుత్వం, సీఎంపై విమర్శలు చేయడాన్ని వారు ఖండించారు. ప్రమాణం చేసిన రోజే చంద్రబాబు నాలుగు పథకాలపై సంతకాలు చేయడాన్ని నేతలు గుర్తుకు తెచ్చారు. దశల వారిగా ఎన్నికల హామీలను నేరవేరుస్తారన్నారు. నాగేంద్ర, చిన్నవెంకటరెడ్డి, క్రిష్ణమోహన్, కోదండరాము, సంజీవరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

డోన్(రూరల్), ఆగస్టు 9: పట్టణంలోని ఎస్‌కేపీ హైస్కూల్‌కు చెందిన 1995-96 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 28 ఏళ్ల తర్వాత ఒక వేదికపై వారు కలుసుకున్నారు. చిన్ననాటి స్నేహితుడు గోపాల్ ఇంటి గృహ ప్రవేశానికి వచ్చి పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపా ధ్యాయులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అమర్నాథ్ రెడ్డి, శాంతిలాల్, రియాజ్, శివ, టీవీ సత్యం, విశ్వనాథ్, పురుషోత్తం, సంజీవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉయ్యాలవాడ, ఆగస్టు 9: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈ గుర్రప్ప శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 33 కేవీ లైను, ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. రైతుల విద్యుత్ మోటార్లకు ఇచ్చే త్రీ ఫేస్ కరెంట్ తెల్లవారుజామున 4 గంటలకు ఇస్తామని ఆయన తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కేపీ తండాలో 'పొలం బడి'

చాగలమర్రి, ఆగస్టు 9: మండలంలోని కేపీ తండా గ్రామంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమంపై గిరిజన రైతులకు ఏవో రంగనేతాజీ అవగాహన కల్పించారు. పొలంబడి ప్రయోజనాలు తెలియజేశారు. వరి రైతులను ఎంపిక చేసి వారికి వరి పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎరువులు, పురుగు మందులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడుతూ యాజమాన్య పద్ధతుల ద్వార పంటలు సాగు చేయడం వల్ల ప్రభుత్వంచే సర్టిఫికెట్ పొంది మార్కెట్‌లో అధిక దరకు ధాన్యం అమ్ముకునే వెసులుబాటు కల్పించనున్నట్లు తెలిపారు. వీహెచ్ఏ ఉమామహేశ్వరి, గిరిజన రైతులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోండి

కోవెలకుంట్ల, ఆగస్టు 9: పట్టణంలో ఈ నెల 26వ తేదీ నుంచి 31 వరకు జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోవెలకుంట్ల ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ విజ్ఞాన వేదిక కోవెలకుంట్ల కమిటీ అధ్యక్షులు జనార్దన్, సభ్యులు కలిసి ఎస్ఐని కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ 26న ఉదయం ఎస్‌బీఐ రోడ్డులో ఉప సర్పంచ్ సూర్యనా రాయణరెడ్డి ఇంటి వద్ద శ్రీకృష్ణున్ని కొలువుదీర్చి ఆగస్టు 31 వరకు ఊరేగింపు నిర్వహిస్తామని, అందుకు అనుమతినివ్వాలని ఎస్ఐని కోరగా ఆయన అనుమతినిచ్చినట్లు తెలిపారు.